క్లుప్తంగా

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే

కమిషనర్ వాణి

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు నేటి నుంచి మున్సిపాలిటీ వ్యాప్తంగా సర్వేను ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఈ సర్వేను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందుకుగాను మున్సిపాలిటీలో ఉన్న 15 వార్డులు, విలీన గ్రామ పంచాయతీ హర్షగూడకు ప్రత్యేకాధికారులను నియమించామన్నారు. వారందరూ సేకరించిన వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు తమ ఆస్తికి సంబంధించిన పత్రాలు, రసీదులు చూపించి, సర్వేకు సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు ఉచితంగా వైద్యారోగ్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని కొండేటి ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కొండేటి మల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం మహేశ్వరం మండల కేంద్రంలోని కొండేటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తం, మూత్ర పరీక్షలను చేశారు. ప్రత్యేకంగా గర్భిణులు, చిన్నపిల్లలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు సౌమ్య, ప్రమోద్, దీప్తి, భాగ్యరాజ్, సీఏ వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చంద్రయ్య, కాంగ్రెస్ మహేశ్వరం గ్రామ అధ్యక్షుడు లాజర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి

కౌన్సిలర్ రవినాయక్



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కౌన్సిలర్ బాదావత్ రవి నాయక్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని 10వ వార్డులో సీసీరోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. వార్డులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తవీర్యార్జున ప్రయోగ్ పూజలు



పూజలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి

కందుకూరు: మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో కార్తవీర్యార్జున ప్రయోగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం మూడోరోజు దీపాలు వెలిగించి కార్తవీర్యార్జునుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కార్తీవీర్యార్జునుడి సాధన చేయించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి, ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పహాడీషరీఫ్: ఇళ్ల మధ్య నెలకొన్న మురుగు సమస్యకు మున్సిపల్ అధికారులు పరిష్కారం చూపారు. జల్‌పల్లి గ్రామం వీకర్ సెక్షన్ కాలనీలో కొద్ది రోజులుగా డ్రైనేజీ సమస్య తలెత్తగా.. సమస్యను కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతకింది నవీన్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన కమిషనర్.. ఆదివారం గల్పర్ యంత్రంతో వ్యర్థాలను సిబ్బందితో తొలగింపచేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ కేంద్రం జల్‌పల్లిలో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లను విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు ఆదిల్ల మహేశ్, సూపర్‌వైజర్ కుమార్‌లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరించి.. లింకును మరిచి

- దూరభారంతో వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బంది
- హైవే నుంచి మామిడిపల్లి మార్గాన్ని కలుపుతూ వంతెన నిర్మిస్తే ప్రయోజనం
- లింకు రోడ్డుకు ఎదురుచూపులు



గుట్టల మధ్య నుంచి ఒరంగడ్డ జల్‌పల్లి రహదారి



మైసమ్మ ఆలయం వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు

పహాడీషరీఫ్: రహదారిని విస్తరించారు. లింకు రోడ్డును మరిచారు. దీంతో వాహనదారులకు, ప్రాంత ప్రజలు దూరభారంతో ఇబ్బంది పడుతున్నారు. దుర్గానగర్ చౌరస్తా(ఒరంగడ్డ) నుంచి తుక్కుగూడ హైవేకు అనుసంధానం చేస్తూ రోడ్డు వేశారు. కానీ.. మామిడిపల్లి గుట్టకు వెళ్లే మార్గాన్ని కలిపే చిన్న లింక్ రోడ్డును విస్మరించారు. దీంతో అటుగా ప్రయాణించే ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చుట్టూ నాలుగైదు కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

2007లో కార్గో రోడ్డు పూర్తి

ఒరంగడ్డ నుంచి నేరుగా లక్ష్మీగూడ, వాంబే కాలనీ, శ్రీరాం కాలనీ, జల్‌పల్లి మీదుగా మామిడిపల్లి వరకు 150 ఫీట్ల విస్తీర్ణంలో 2007లో కార్గో రహదారిని పూర్తి చేశారు. జల్‌పల్లి నుంచి మామిడిపల్లికి వెళ్లే మార్గ మధ్యలో కార్గో రోడ్డు నుంచి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా తుక్కుగూడ హైవేకు మరో రోడ్డు వేశారు. ఈ రహదారిలో కార్గో రోడ్డు నుంచి ఈర్లగండి మైసమ్మ ఆలయం వరకు 750 మీటర్ల పొడువు, తిరిగి గుట్ట పై నుంచి తుక్కుగూడ వైపునకు దాదాపు మూడు కిలో మీటర్ల మేర రోడ్డు పనులను అప్పట్లోనే పూర్తి చేశారు. కానీ మైసమ్మ ఆలయం నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మించలేదు.

కొండలు ఒలిచినా..

రహదారి నిర్మాణంలో భాగంగా పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి దేవేందర్ నగర్, రంగనాయకుల కాలనీ మీదుగా భారీ గుట్టను ఒలిచి.. మామిడిపల్లి మైసమ్మ ఆలయం వరకు రహదారిని నిర్మించారు. కానీ.. పావు కిలో మీటర్ లింకును మాత్రం పూర్తి చేయలేదు. దీంతో కొండలు ఒలిచి రహదారిని నిర్మించినా.. ప్రయోజనం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మైసమ్మ ఆలయం కూడలి వద్ద పహాడీషరీఫ్- మామిడిపల్లి రోడ్డుకు ఇబ్బంది లేకుండా ఫ్లై ఓవర్‌ను నేరుగా గుట్ట పైకి అనుసంధానం చేయాలని ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం

ఒరంగడ్డ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు పి- 7 కార్గో రోడ్డును ప్రతిపాదించి 2007లో మామిడిపల్లి వివేకానంద విగ్రహం వరకు పూర్తి చేసిన అధికారులు.. తాజాగా ఎయిర్‌పోర్ట్‌కు రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. రూ.29.5 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి పనులు పూర్తయ్యాయి. ఇదే విధంగా మైసమ్మ ఆలయం వద్ద లింకును పూర్తి చేయాలని వాహనదారుల డిమాండ్.

వంతెన నిర్మాణమే పరిష్కారం



రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రహదారిలో చిన్న లింకు రోడ్డును పూర్తి చేయకపోవడం సరైంది కాదు. మైసమ్మ ఆలయం వద్ద గుట్ట పైకి ఫ్లై ఓవర్‌ను వేసినట్లయితే రహదారి పూర్తి స్థాయిలో వినియోగంలోకి వస్తుంది. మామిడిపల్లి గుట్టలో కంపెనీలు వెలిశాయి. ఇంకా భారీగా ఐటీ కంపెనీలు వస్తున్నాయి. ఈ లింకు రోడ్డును పూర్తి చేస్తే.. అందరికీ మేలు.

– సుమన్ గౌడ్, మామిడిపల్లి

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలమణికంఠ అయ్యప్ప దేవాలయంలో ఆదివారం మహాపడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఆదిల్ల మహేశ్ కన్నెస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పూజను మద్ది జగదీశ్వర్‌రెడ్డి గురుస్వామి, జగన్మోహన్‌రెడ్డి గురుస్వాములు జరిపించారు. ఉదయం గణపతి హోమం, మధ్యాహ్నం పడి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తుల గీతాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.

మెట్రో ఏర్పాటు చేయాలని వినతి

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ చౌరస్తా మీదుగా మెట్రో రైలు లైన్ వెళ్లే విధంగా చూడాలని బీజేపీ నాయకులు ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎల్‌బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో రైలు నిర్మిస్తున్నందున, దీన్ని బాలాపూర్ చౌరస్తా మీదుగా ఏర్పాటు చేయడంతో నియోజకవర్గ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రత్యేక చొరవ తీసుకుని మెట్రో ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కీసర గోవర్ధన్‌రెడ్డి, ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, భిక్షపతిచారి, గౌరీశంకర్, గాజుల మధు, సోమేశ్వర్, చెవ్వ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో నాయకులు, కార్పొరేటర్లు


ఘనంగా పీవీటీ మార్కెట్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న పీవీటీ మర్చంట్ కమిటీ సభ్యులు

హుడాకాంప్లెక్స్: కొత్తపేటలోని పీవీటీ మార్కెట్ 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం మార్కెట్ మర్చంట్ కమిటీ అధ్యక్షుడు కైరంకొండ ధనుంజయ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా వినియోగదారులు, హోల్‌సేల్ వ్యాపారస్తులు పీవీటీ మార్కెట్‌పై నమ్మకంతో వస్త్రాలు కొనుగోలు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొడ్డు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి భువనగిరి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి తడక కృష్ణ, కోశాధికారి చెరుకు భిక్షపతి, డైరెక్టర్లు ప్రసాద్‌కుమార్, సురేశ్, పోచయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రానికి నూతన అధ్యయనాన్ని రచించారని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్‌లోని ఆల్ఫోర్స్ కేంద్రం కార్యాలయంలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్-2024ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క విద్యార్థి రామానుజన్ మార్గాన్ని అనుసరించి గణితంలో అద్భుతాలు సృష్టించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒలింపియాడ్-2024ను అట్టహాసంగా తెలంగాణ, మహారాష్ట్రలోని విద్యాసంస్థల్లో నిర్వహించినట్లు తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 22న బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండల పరిధిలోని వెంకన్నగూడ తండాలో కీర్తిశేషులు టీక్యానాయక్ జ్ఞాపకార్థం వారి కుమారుడు డాక్టర్ ఆనంద్‌నాయక్ ఏర్పాటు చేసిన నూతన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొర్ర రవినాయక్, సురేశ్, తండావాసులు సక్రూనాయక్, సభావత్ భరత్‌నాయక్, పాత్లావత్ సేవ్యానాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మేళ్ల బాయి తండాలో ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జిబాబునాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

తుర్కయంజాల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ 14, 24వ వార్డుల్లో పర్యటించారు. రూ.2 కోట్ల 91 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కమిషనర్ అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

మాడ్గుల: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని మార్కెట్ డైరెక్టర్ జల్ల రమేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధి బ్రహ్మణపల్లి గ్రామంలో ఆదివారం ఆయన లబ్ధిదారులకు రూ.30వేల విలువ గల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉందని పేర్కొన్నారు. వైద్య సహాయం కోసం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్, నాయకులు వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, శివ, లబ్ధిదారులు శ్రీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదం

ఎస్‌ఐ సుశీల



సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎస్‌ఐ సుశీల

షాద్‌నగర్‌రూరల్: నేరాలను నియంత్రించడంలో సీసీకెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్‌ఐ సుశీల అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్, కమ్మదనం గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలను ఆదివారం ఎస్‌ఐ సుశీల పరిశీలించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, బస్టాండ్, చౌరస్తా వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మురళీధర్‌రెడ్డి, నర్సింలు, అమరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డిని ఆమె అభినందించారు.

భజనలతో మానసిక ప్రశాంతత



విరాళం అందిస్తున్న నాయకుడు కృష్ణమోహన్

చేవెళ్ల: భజనలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ యువ నాయకుడు కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో కార్తీక మాసంలో 41రోజుల పాటు నిర్వహించిన భజన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో భజన భక్తులను గ్రామస్తులు సన్మానించారు. గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు కృష్ణమోహన్ వారిని సన్మానించి వారికి రూ.5వేల విరాళం అందజేశారు. ముగింపు సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భజన భక్తులు రాములు, నర్సింలు, గోపాల్, శస్త్రకర్, రాంచంద్రయ్య, అంజయ్య, శివనాగు, ఆత్మలింగం, సదానందం, శ్రీశైలం, ప్రసాద్‌కుమార్, విజయ్, రవి, కృష్ణ, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



సబితారెడ్డిని కలిసిన మహిళలు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎత్‌మార్‌పల్లి గ్రామానికి చెందిన మహిళలు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహమూదాబేగం ఆధ్వర్యంలో నక్కలపల్లి సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ సమక్షంలో మాజీ మంత్రి నివాసంలో పలువురితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వం ద్వారా పోరాడి కృషి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎత్‌మార్‌పల్లి మహిళా సభ్యులు, నక్కలపల్లి మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

తుర్కయంజాల్: సీపీఎం మున్సిపల్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పగడాల యాదయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రాగన్నగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకొకసారి మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఈ నెల 19న జరగనున్న సభలో పార్టీ నిర్వహించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు, పాలకవర్గాల విధానాలపై చర్చించడంతో పాటు, చేపట్టబోయే సభ కార్యాచరణపై చర్చించనున్నామని తెలిపారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- విషపూరిత కీటకాలకు స్థావరంగా మారుతున్న వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



వృథాగా మండల పరిషత్ పూర్వ కార్యాలయ భవనం



వృథాగా వ్యవసాయ కార్యాలయ భవనం

కొందుర్గు: మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. ప్రజాసొమ్ము లక్షల రూపాయలు ఖర్చుచేసి ఇలా భవనాలు వదిలేయడం ఏమిటని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా మండల పరిషత్ కార్యాలయానికి భవనం నిర్మించడంతో ఇదివరకు మండల పరిషత్ కార్యాలయంగా కొనసాగిన రెండు భవనాలు వృథాగానే ఉన్నాయి. ఓ భవనంలో ఇటీవల లక్షల రూపాయలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు. ఆర్‌సీసీ పైకప్పు గల చక్కని భవనాన్ని ఇలా వదిలేయడమేమిటనీ అంటున్నారు. అదేవిధంగా వ్యవసాయ కార్యాలయంగా కొనసాగిన ఓ భవనం, మోడల్ ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్మించిన మరో భవనం వృథాగానే పడిఉన్నాయి. ఇక గతంలో పీహెచ్‌సీ సిబ్బందికి కేటాయించిన ఓ భవనం కూడా వృథాగానే ఉంది. దీంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎనిమిది వరకు భవనాలు వృథాగానే ఉన్నాయి. వీటిని వినియోగించకపోవడంతో విషపూరిత కీటకాలకు స్థావరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.